




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక :11 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం సోమవారం 16 సెప్టెంబర్ 2024 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :11 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM MON 16 SEPTEMBER 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


# రాష్ట్రానికి వచ్చిన సీట్లను తిప్పిపంపడం దేనికి నిదర్శనం చంద్రబాబు గారూ?

- చంద్రబాబుపై జగన్ ఫైర్
- కొత్త ఎంబీబీఎస్ సీట్లను వద్దంటూ చంద్రబాబు లేఖ రాశారన్న జగన్
- ఆ లేఖను వెనక్కి తీసుకోవాలని డిమాండ్
- మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తున్నారంటూ ఆరోపణలు



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రానికి ఎంబీబీఎస్ సీట్లు వస్తుంటే సంతోషించాల్సింది పోయి, వద్దంటూ చంద్రబాబు ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయడం దారుణమని వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. పొరుగు రాష్ట్రాలు కొత్త మెడికల్ కాలేజీలు, ఎంబీబీఎస్ సీట్ల కోసం ప్రదక్షిణలు చేస్తుంటే... మన రాష్ట్రానికి వచ్చిన సీట్లను తిప్పి పంపడం ఏ తరహా పరిపాలనకు నిదర్శనం చంద్రబాబు గారూ? అంటూ సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించారు. నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం వెళితే ఈ సంవత్సరంలోనే పులివెందుల, మదనపల్లె, మార్కాపురం, పాడేరు, ఆదోని మెడికల్ కాలేజీల్లో మరో 750 సీట్లు అందుబాటులోకి వచ్చేవని జగన్ వెల్లడించారు. కానీ, ఇప్పుడు పాడేరు కాలేజీని 50 సీట్లకే పరిమితం చేయడం ఏంటి? పులివెందుల కాలేజీకి ఎన్ఎంసీ 50 సీట్లు కేటాయిస్తే, వద్దంటూ ప్రభుత్వం లేఖ రాయడం ఏంటి? వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేసే కుంభకోణాలకు ఆలోచన చేయడం ఏంటి? అని నిలదీశారు. అధికారంలోకి వస్తే మొత్తం సీట్లన్నీ ఫ్రీ అన్నారని, సీట్ల సంగతి దేవుడెరుగు... ఇప్పుడు ఏకంగా కాలేజీలనే అమ్మేస్తున్నారని జగన్ ఆరోపించారు. పార్లమెంటు నియోజకవర్గానికో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఉంటే, అది ఆ నియోజకవర్గంలో ఉన్న ఏరియా ఆసుపత్రులకు, సీహెచ్‌సీలకు, పీహెచ్‌సీలకు, విలేజ్ క్లినిక్స్‌కు మార్గదర్శిగా ఉంటుందని తెలిపారు. సూపర్ స్పెషాలిటీ సేవలు కూడా పేదలకు ఉచితంగా ఆ జిల్లాస్థాయిలో, అక్కడే లభిస్తాయని... అలాంటి కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే ముందుగా నష్టపోయేది పేద విద్యార్థులే కాదు, అక్కడి ప్రజలకు కూడా అని జగన్ స్పష్టం చేశారు. చంద్రబాబు ఇకనైనా కళ్లు తెరవాలని, తక్షణమే ఎన్ఎంసీకి రాసిన లేఖను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని సూచించారు. "మెడికల్ కాలేజీల్లో మిగిలిన పనులను పూర్తి చేసి... పేద పిల్లలకు వైద్య విద్యను, పేదలకు నాణ్యమైన ఉచిత వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురండి... మీకు చేతనైనంత ఖర్చు చేస్తూ వెళ్లండి... మీకు చేతకాకపోతే మేం మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాతైనా పూర్తి చేస్తాం. అంతేకానీ, ఇలా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ మాటున కుంభకోణాలు చేయడం మానుకో చంద్రబాబూ! లేకపోతే ప్రజల ఆగ్రహానికి గురి కావాల్సి ఉంటుంది" అని జగన్ తన ట్వీట్ లో పేర్కొన్నారు.

## పాఠాలు కూడా మీరే చెబుతారా ప్రొఫెసర్ జగన్?


- నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాలల పరిస్థితిపై మంత్రి సత్యకుమార్ స్పందన
- నాలుగేళ్లయినా ఒక్క కాలేజీ నిర్మాణం పూర్తి చేయలేకపోయారని విమర్శలు
- పులివెందుల కాలేజీలో బోధనా సిబ్బంది కొరత ఉందని వెల్లడి
- పాఠాలు ఎవరు చెప్పాలని నిలదీసిన వైనం



పెన్ పవర్ డెస్క్:ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వైసీపీ అధ్యక్షుడు జగన్ పై ధ్వజమెత్తారు. జగన్ వంటి అసమర్థ వ్యక్తి ముఖ్యమంత్రి ఎలా అయ్యారో! అంటూ విమర్శనాత్మకంగా స్పందించారు.
గత వైసీపీ ప్రభుత్వ పాలనలో 17 వైద్య కళాశాలల నిర్మాణాన్ని ప్రారంభించారని, నాలుగేళ్లయినా ఒక్క కాలేజీ నిర్మాణాన్ని కూడా పూర్తి చేయలేకపోయారని

వివరాలు 2లో..

## ఒకేసారి ఆరు వందేభారత్ రైళ్లను ప్రారంభించిన ప్రధాని మోదీ



- ఝార్ఖండ్ లో పర్యటించిన ప్రధాని మోదీ
- టాటానగర్-పాట్నా వందేభారత్ రైలుకు టాటా నగర్ లో ప్రారంభోత్సవం
- అదే సమయంలో మిగతా ఐదు రైళ్లకు వర్చువల్ గా ప్రారంభోత్సవం

పెన్ పవర్ డెస్క్: ప్రధాని నరేంద్ర మోదీ ఒకేసారి 6 వందేభారత్ రైళ్లను ప్రారంభించారు. మోదీ నేడు ఝార్ఖండ్ లోని టాటా నగర్ జంక్షన్ రైల్వే స్టేషన్ టాటానగర్-పాట్నా వందేభారత్ రైలును ప్రారంభించారు. అదే సమయంలో మరో ఐదు రైళ్లను కూడా

వివరాలు 2లో..

## మేం అధికారంలోకి వస్తే..గంటలోపే మద్యపాన నిషేధం ఎత్తివేస్తా

- అధికారంలోకి వచ్చాక గంటలోపల బీహార్ లో మద్యపాన నిషేధం ఎత్తివేస్తాం.. ప్రశాంత్ కిశోర్
- తేజస్వీ యాదవ్ యాత్రపై వ్యంగ్యంగా స్పందించిన పీకే
- తొమ్మిదో తరగతి ఫెయిలైన లీడర్ బీహార్ అభివృద్ధి గురించి మాట్లాడుతున్నాడని సెటైర్
- ఆర్జేడీ, జేడీయూ రెండూ బీహార్ ను ముంచేశాయని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:బీహార్ లో మద్యనిషేధం అవసరంలేదని, తాము అధికారంలోకి వచ్చిన గంటలోపల నిషేధం ఎత్తివేస్తామని జన సురాజ్ పార్టీ అధ్యక్షుడు, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ హామీ ఇచ్చారు. అక్టోబర్ 2న జన

వివరాలు 2లో..

## మంగళగిరి బ్యాడ్మింటన్ క్రీడాకారుడికి మంత్రి నారా లోకేశ్ ఆర్థిక సాయం

- యువ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తున్న నారా లోకేశ్
- లోకేశ్ ను కలిసి తన పరిస్థితి వివరించిన చరణ్ నాయక్
- చరణ్ నాయక్ యువ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు
- ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ర్యాంకింగ్ టోర్నీల్లో ఆడే అవకాశం
- ఆ రెండు టోర్నీల్లో ఆడేందుకు లోకేశ్ ఆర్థిక సహకారం

వివరాలు 2లో..



## భూ సమీకరణలో రైతుల నుంచి అంగీకార పత్రాలు తీసుకున్న మంత్రి నారాయణ

- రాజధాని ప్రాంతంలో మంత్రి నారాయణ పర్యటన
- ఎర్రబాలెం గ్రామంలో పది మంది రైతుల నుంచి 10.37 ఎకరాల సేకరణ
- తమను సంప్రదిస్తే ఇళ్లకే వెళ్లి భూములు తీసుకుంటామన్న మంత్రి
- భూములిచ్చే రైతులకు వారు కోరుకున్న చోట స్థలాల కేటాయింపు

వివరాలు 2లో..



## ఏపీ మంత్రి నారా లోకేశ్ కు రూ.5 కోట్ల విరాళం చెక్కు అందించిన డాక్టర్ కిరణ్



- ఏపీలో వరద బీభత్సం
- పెద్ద మనసుతో స్పందించిన దివీస్ ల్యాబొరేటరీస్
- తక్షణ సాయంగా రూ.4.8 కోట్ల నగదు బదిలీ
- రూ.5 కోట్ల చెక్కు అందజేత
- మొత్తం రూ.9.8 కోట్లు అందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపిన లోకేశ్

పెన్ పవర్ డెస్క్:ఏపీలో వరద బీభత్సం పట్ల దివీస్ ల్యాబొరేటరీస్ యాజమాన్యం ఉదారంగా స్పందించింది. వరద బాధితుల సహాయార్థం మొత్తం రూ. 9. 8 కోట్లు విరాళంగా ప్రకటించింది. ఇప్పటికే రూ. 4. 8 కోట్ల నగదును తక్షణ సాయం కోసం బదిలీ చేసిన దివీస్ ల్యాబొరేటరీస్ యాజమాన్యం... నేడు మరో రూ. 5 కోట్లను అందించింది.

వివరాలు 2లో..

## కూలిన మూడంతస్తుల భవనం... 10 మంది సజీవ సమాధి

- ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ఘటన
- కూలిన 50 ఏళ్ల నాటి శిథిల భవనం
- మృతుల్లో ఆరుగురు చిన్నారులు
- మరో ఐదుగురి పరిస్థితి విషమం



పెన్ పవర్ డెస్క్:ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో తీవ్ర విషాదం నెలకొంది. మూడంతస్తుల భవనం కూలి ఆరుగురు చిన్నారులు సహా పదిమంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. స్థానిక జకీర్ కాలనీలో ఉన్న ఈ భవనం 50 ఏళ్ల నాటిది. శిథిల పరిస్థితుల్లో ఉన్న భవనం గత సాయంత్రం ఒక్కసారిగా కుప్పకూలింది.

వివరాలు 2లో..

## జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద కమాండర్‌ను చుట్టుముట్టిన భద్రతా బలగాలు



- ప్రధాని నరేంద్రమోదీ ఎన్నికల ప్రచారం నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లో తెగబడుతున్న ఉగ్రవాదులు
- ముగ్గురు టెర్రరిస్టులను హతమార్చిన భద్రతా బలగాలు
- ఇద్దరు జవాన్ల వీర మరణం

పెన్ పవర్ డెస్క్:జమ్మూకశ్మీర్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నికల పర్యటన నేపథ్యంలో ఉగ్రవాదులు చెలరేగిపోతున్నారు. గత 24 గంటల వ్యవధిలో మూడు ఎన్‌కౌంటర్లు చోటుచేసుకున్నాయి. బారాముల్లాలో ముగ్గురు ముష్కరులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ఇద్దరు జవాన్లు అమరులయ్యారు. తాజాగా ఈ తెల్లవారుజామున పూంచ్ జిల్లాలో ఓ ఉగ్రవాద గ్రూపునకు చెందిన టాప్ కమాండర్, ఇద్దరు టెర్రరిస్టులను భద్రతా బలగాలు చుట్టుము ట్టాయి. గత రాత్రి ఈ ప్రాంతంలో వీరు నక్కినట్టు సమాచారం అందుకున్న ఆర్మీ గాలింపు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో మెందహార్‌లోని పథనాతీర్ వద్ద భద్రతా దళాలపై ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో భద్రతా దళాలు ఎదురు కాల్పులు ప్రారంభించాయి. ప్రస్తుతం ఎన్‌కౌంటర్ కొన సాగుతోంది. కాగా, గత 42 ఏళ్లలో భారత ప్రధాని జ మ్మూక శ్మీర్‌లో ఎన్నికల ప్రచారానికి వెళ్లడం ఇదే తొలిసారి.

## రెండు రోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తా..

### కేజ్రీవాల్ సంచలన ప్రకటన



- రెండ్రోజుల్లో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా: అరవింద్ కేజ్రీవాల్ సంచలన ప్రకటన
- ఈ ఉదయం పార్టీ హెడ్ క్వార్టర్స్‌ను సందర్శించిన కేజ్రీవాల్
- పార్టీ కార్యకర్తలు, నాయకులకు ధన్యవాదాలు
- హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల ప్రచారంపై పార్టీ నేతలతో చర్చ
- ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడుగుతానని, తాను నిజాయతీపరుడినైతే ఓట్లు వేస్తారన్న కేజ్రీవాల్

పెన్ పవర్ డెస్క్:మరో రెండ్రోజుల్లో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తానని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సంచలన ప్రకటన చేశారు. నిర్దోషిగా నిరూపించుకునేంత వరకు సీఎంగా ఉండనని అన్నారు. అందుకే ప్రజాతీర్పు కోరతామని స్పష్టం చేశారు. నేను నిర్దోషినని నమ్మితే భారీగా ఓట్లు వేయండి

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# మిస్టరీ.. ముందుగా ఎవరెస్ట్ ఎక్కింది ఎవరు.?

అధునాతన టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లో కూడా ఎవరెస్ట్ ఎక్కడం అంటే సాహసమనే చెప్పాలి. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన శిఖరం అయిన ఎవరెస్ట్‌ని 1953లో తొలిసారి ఇద్దరు పర్వతారోహకులు ఎక్కినట్టు రికార్డులు చెప్తున్నాయి. కానీ.. అంతకుముందే మరో ఇద్దరు ఎవరెస్ట్‌ని ఎక్కారని కొందరు వాదిస్తున్నారు. ఎవరెస్ట్ అంటేనే ఒక మిస్టరీ. కానీ.. దాన్ని ముందుగా ఎక్కిందవరనేది కూడా మిస్టరీనే ఇప్పటికీ. మేఘాలు ఎవరెస్ట్ పర్వతాన్ని కప్పినట్టే.. దాని అధిరోహణ చరిత్రను కూడా కప్పి ఉంచి అంతు చిక్కకుండా చేశాయి. అధికారిక లెక్కల ప్రకారం 1953 మే 29న న్యూజిలాండ్‌కు చెందిన సర్ ఎడ్మండ్ హిల్లరీ, నేపాల్‌కు చెందిన షెర్పా టెంజింగ్ నార్గే ఎవరెస్ట్ ఎక్కారు.

మానవులు సాధించిన విజయాల చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా దీని గురించి చెప్తుంటారు. ఈ చారిత్రాత్మక ఆరోహణకు ముందు ఎవరెస్ట్ చివరి భాగాన్ని చేరుకోవడానికి అనేక మంది ప్రయత్నించారు. ముఖ్యంగా 1920ల ప్రారంభంలో ఎక్కువగా బ్రిటిషర్లు ట్రై చేశారు. హిల్లరీ, టెంజింగ్ నార్గే కంటే మూడు దశాబ్దాల ముందే బ్రిటన్‌కి చెందిన జార్జ్ మల్లోరీ, ఆండ్రూ ఇర్విన్ ఎవరెస్ట్ ఎక్కినట్టు కొందరు వాదిస్తున్నారు. వీళ్లు 1924లో ఎవరెస్ట్ ఎక్కేందుకు వెళ్లారు. అదృశ్యం అయ్యారు.

**ఎప్పుడు చనిపోయారు?**

అత్యంత కఠినమైన వాతావరణం ఉండే ఉత్తర ధృవం, దక్షిణ ధృవాలకి 1920ల నాటికి మనుషులు వెళ్లారు. కానీ.. ప్రపంచ "మూడో ధృవం"గా పేరున్న హిమాలయాల్లోని ఎవరెస్ట్‌ని మాత్రం ఎక్కలేకపోయారు. అందుకే ఎలాగైనా ఎవరెస్ట్‌ని అధిరోహించాలనే ఉద్దేశంతో జార్జ్ మల్లోరీ, ఆండ్రూ ఇర్విన్ ప్రయత్నాలు మొదలుపెట్టారు. కానీ.. ఎవరెస్ట్ ఎక్కుతూ మధ్యలోనే చనిపోయారు. కానీ.. కొందరు మాత్రం ఎవరెస్ట్ ఎక్కి, దిగుతుంటే చనిపోయారని చెప్తున్నారు. ఇంతకీ వాళ్ల ప్రయాణం ఎలా సాగింది? అనేది తెలుసుకోవడానికి అంతగా ఆధారాలు లేకపోయినా దొరికిన కొన్ని ఆధారాలతో ఒక అంచనాకి వచ్చారు ఎక్స్‌పర్ట్స్. ఈ ఇద్దరూ 1924లో ఆర్టిఫిషియల్ ఆక్సిజన్‌తో ఎవరెస్ట్ ఎక్కేందుకు బయల్దేరారు. వాళ్లలో మల్లోరీ అప్పటికే రెండుసార్లు ఎవరెస్ట్ ఎక్కేందుకు ప్రయత్నించాడు. కానీ.. 24,600 అడుగుల ఎత్తు దాటి పైకి వెళ్లలేకపోయాడు.

పైగా అతను బ్రిటన్‌లోని బెస్ట్ క్లైంబర్స్(అధిరోహకుడు)లో ఒకడిగా గుర్తింపు పొందాడు. ఇక ఇర్విన్ విషయానికి వస్తే.. వయసు చాలా చిన్నది. 22 ఏండ్లు ఉంటాయి. పర్వతాలు ఎక్కడంలో అంతగా అనుభవం కూడా లేదు. కానీ.. అతను ఆక్సిజన్ సిలిండర్స్ ఎక్స్‌పర్ట్. ఒక పర్వతారోహకుడి మీద ఆక్సిజన్ ఎలా ఎఫెక్ట్ చూపిస్తుంది? ఆక్సిజన్ తగ్గిన తర్వాత ఏం చేయాలి? ఇలాంటివన్నీ ఇర్విన్‌కు బాగా తెలుసు. అప్పటివరకు అంత ఎత్తులో ఉన్నప్పుడు మానవ శరీరం ఎలా స్పందిస్తుంది? ఎలాంటి ఎఫెక్ట్ పడుతుంది? ఆర్టిఫిషియల్ ఆక్సిజన్ అవసరం ఎంతవరకు ఉంటుందనే వివరాలు కచ్చితంగా ఎవరికీ తెలియవు. కాబట్టి.. ఒక్కడే ఎవరెస్ట్ ఎక్కడం అంత ఈజీ కాదని మల్లోరీకి అర్థమై వెంట ఇర్విన్‌ని తీసుకెళ్లాడు. అతను ఆక్సిజన్ సిలిండర్ల ఫిక్సింగ్, అసెంబ్లింగ్ చేయడంలో ఎక్స్‌పర్ట్.

చేరుకున్నారా? ఎవరెస్ట్ ఎక్కిన మల్లోరీ, ఇర్విన్లు మళ్లీ తిరిగి రాలేదు. అయితే.. వాళ్లు ఎక్కుతుంటే చనిపోయారా? లేదంటే.. దిగుతుంటే చనిపోయారా? అనేది మాత్రం ఇప్పటికీ తెలియలేదు. ఈ సంఘటన జరిగిన చాలా ఏండ్లకు 1999లో క్లైంబర్ కాన్రాడ్ అంకెర్ దాదాపు 27,250 అడుగుల (8,229 మీ) ఎత్తులో మల్లోరీ శవాన్ని చూశాడు. ఎవరెస్ట్ ఎత్తు 29,032 అడుగులు (8,849 మీ). అంటే ఇంకా మిగిలింది 2 వేల అడుగులే. ఇర్విన్ శవం ఇప్పటికీ దొరకలేదు. పైగా.. వాళ్లు తమ వెంట తీసుకెళ్లిన కెమెరా కూడా దొరకలేదు. ఆ కెమెరా దొరికితే కనుక వాళ్లు ఎవరెస్ట్ అగ్రస్థానానికి చేరుకున్నారో, లేదో తెలిసేది.

**ఎలా చనిపోయారు?**

మల్లోరీ యాత్ర మీద రీసెర్చ్ చేసిన జియాలజిస్ట్ ఒడెల్లె మాత్రం వాళు ఎవరెస్ట్ చివరి భాగానికి చేరుకుని ఉంటారని అంచనా వేశాడు. అయితే.. వాళ్లు ఎవరెస్ట్ ప్రయాణం మొదలుపెట్టిన కొన్ని రోజులకే అక్కడి వాతావరణంలో చాలా మార్పులు వచ్చాయి. దానివల్ల ఎవరెస్ట్ మీద మంచు తుపాన్లు వచ్చి ఉంటాయి. చాలా వేగంగా చల్లటి గాలులు వీయడంతో ఆ ఇద్దరూ చనిపోయారని ఒడెల్లె పుస్తకంలో రాశాడు.

# పాఠాలు కూడా మీరే చెబుతారా ప్రొఫెసర్ జగన్?

- మొదటి పేజీ తరువాయి

వెల్లడించారు. సగానికి పైగా కాలేజీల నిర్మాణం పునాదుల దశల్లోనే ఉందని మంత్రి సత్యకుమార్ వివరించారు. నిర్మాణం పూర్తికాకుండానే గతేడాది రాజమండ్రిలో మెడికల్ కాలేజీ ప్రారంభించారని, ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతి గదులు లేని పరిస్థితి నెలకొందని చెప్పారు. జగన్ సారూ... విద్యార్థులను ఎక్కడ చదివించాలి... చెట్ల కింద చదివించాలా? అంటూ విమర్శనాస్త్రాలు సంధించారు. పులివెందుల మెడికల్ కాలేజీ నిర్మాణం కూడా ఇంకా పూర్తి కాలేదని మంత్రి సత్యకుమార్ తెలిపారు. పులివెందుల కాలేజీలో 48 శాతం బోధనా సిబ్బంది లేరన్న విషయం జగన్ కు తెలియదా? అని ప్రశ్నించారు. తరగది గదులు లేవంటే ఎలాగోలా సర్దుకుపోతాం... మరి బోధనా సిబ్బంది లేకపోతే పాఠాలు ఎవరు చెబుతారు? అని నిలదీశారు. పాఠాలు కూడా మీరే చెబుతారా ప్రొఫెసర్ జగన్? అంటూ ఎద్దేవా చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఎందుకు ఆడుకోవాలనుకున్నారు? అని మంత్రి సత్యకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధాలు ప్రచారం చేస్తున్నారనే ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారు... అయినా బుద్ధి తెచ్చుకోకపోతే ఎలా? అని మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యానించారు. ప్రజాభిప్రాయాన్ని అర్థం చేసుకుని జగన్ ఇప్పటికైనా మారాలి అని హితవు పలికారు.

# కూలిన మూడంతస్తుల భవనం... 10 మంది సజీవ సమాధి

- మొదటి పేజీ తరువాయి

భవనం కింద ఓ డైరీ ఫామ్ నిర్వహిస్తున్నారు. ఈ ఘటనలో ఒక కుటుంబం మొత్తం సమాధి అయిపోయింది. కొన్ని పశువులు మృత్యువాత పడ్డాయి. సమాచారం అందుకున్న వెంటనే జాతీయ, రాష్ట్ర విపత్తు నిర్వహణ దళాలు, స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఒక పక్క వర్షం పడుతుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. స్థానిక వలంటీర్లు కూడా సహాయక చర్యల్లో పాలుపంచుకున్నారు. అర్ధరాత్రి 2 గంటల వరకు శిథిలాలు తొలగించగా, ఈ ఉదయం మళ్లీ ప్రారంభమయ్యాయి. కూలిన భవనం ఇరుకు ప్రదేశంలో ఉండడంతో బుల్డోజర్లు అక్కడి వెళ్లలేకపోతున్నాయని పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన ఐదుగురిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించామని, వారి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. మృతులను ఒకే కుటుంబానికి చెందిన నఫీసా (63), ఫర్హానా (20), అలీసా (18), సాజిద్ (40), సానియా (15), సాఖిబ్ (11), సిమ్రన్ (15 నెలలు), ఆలియా (6), రిజా (7), రిమ్సా (5 నెలలు) గా గుర్తించారు. భవనం కూలిన ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# మేం అధికారంలోకి వస్తే..గంటలోపే మద్యపాన నిషేధం ఎత్తివేస్తా

- మొదటి పేజీ తరువాయి

సురాజ్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడం లేదని, ఆ అవసరం కూడా లేదని ఆయన చెప్పారు. బీహార్ లో ప్రస్తుతం అధికారంలో ఉన్న జేడీయూతో పాటు ఆర్జేడీ కూడా రాష్ట్రాన్ని నాశనం చేశాయని ఆరోపించారు. ఆర్జేడీ లీడర్ తేజస్వీ యాదవ్ యాత్ర చేపట్టడంపై ప్రశాంత్ కిశోర్ వ్యంగ్యంగా స్పందించారు. కనీసం ఇలాగైనా ఆయన ఇల్లు వదిలి ప్రజల్లోకి రావడం సంతోషకరమని అన్నారు. తొమ్మిదో తరగతి కూడా పూర్తిచేయని వ్యక్తి రాష్ట్ర అభివృద్ధి గురించి మాట్లాడుతున్నాడని సెటైర్ వేశారు. తేజస్వీ యాదవ్ కు జీడీపీకి, జీడీపీ గ్రోత్ కు తేడా తెలియదని అన్నారు.బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిలో చేరినందుకు నితీశ్ కుమార్ ముకులిత హస్తాలతో క్షమాపణలు చెప్పారంటూ తేజస్వీ యాదవ్ చేసిన వ్యాఖ్యలపై ప్రశాంత్ కిశోర్ స్పందించారు. 'ఎవరు ఎవరికి ముకులిత హస్తాలతో క్షమాపణలు కోరారో తెలియదు కానీ నితీశ్, తేజస్వీ.. ఇద్దరూ బీహార్ కు నష్టం

చేశారు' అని చెప్పారు. బీహార్ కు సీఎం కావాలని ఆశిస్తున్న తేజస్వీ యాదవ్ కు ఉన్న అర్హత ఏంటని ప్రశాంత్ కిశోర్ నిలదీశారు. మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ కుమారుడు కావడం తప్పితే తేజస్వీకి నాయకత్వం వహించేందుకు ఎలాంటి అర్హత లేదని కొట్టిపారేశారు.

# మంగళగిరి బ్యాడ్మింటన్ క్రీడాకారుడికి మంత్రి నారా లోకేశ్ ఆర్థిక సాయం

**పెన్ పవర్ డెస్క్:**ప్రతిభావంతులైన యువ క్రీడాకారులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని ఏపీ మంత్రి నారా లోకేశ్ మరోసారి నిరూపించుకున్నారు. తాజాగా, మంగళగిరి నియోజకవర్గానికి చెందిన యువ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కె.చరణ్ నాయక్ కు ఆర్థిక చేయూతనిచ్చారు. చరణ్ నాయక్ అంతర్జాతీయ స్థాయిలో షటిల్ బ్యాడ్మింటన్ క్రీడలో సత్తా చాటుతున్నాడు. ఆస్ట్రేలియాలో అక్టోబరు 16 నుంచి 20 వరకు... న్యూజిలాండ్ లో 23 నుంచి 26 వరకు జరగనున్న అంతర్జాతీయ ర్యాంకింగ్ పోటీల్లో చరణ్ నాయక్ పాల్గొంటున్నాడు. ఈ నేపథ్యంలో, రెండు విదేశీ పర్యటనలు చేయాల్సి రావడంతో, ఈ యువ క్రీడాకారుడు ఆర్థికసాయం కోరుతున్నాడు. నిన్న మంత్రి నారా లోకేశ్ ను కలిసి తన పరిస్థితిని వివరించాడు. చరణ్ నాయక్ గురించి తెలుసుకున్న నారా లోకేశ్.... అతడి విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించారు.

'ప్రైడ్ ఆఫ్ మంగళగిరి' పేరిట అతడికి ఆర్థికసాయం చేశారు. ఈ మేరకు, స్థానిక టీడీపీ నేతల ద్వారా రూ.3 లక్షలు చరణ్ నాయక్ కు అందించారు. లోకేశ్ తనకు ఆర్థికసాయం చేయడం పట్ల ఆ యువ షట్లర్ సంతోషం వ్యక్తం చేశాడు. ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశాడు.

# ఏపీ మంత్రి నారా లోకేశ్ కు రూ.5 కోట్ల విరాళం చెక్కు అందించిన డాక్టర్ కిరణ్

- మొదటి పేజీ తరువాయి

ఇవాళ ఏపీ మంత్రి నారా లోకేశ్ ను కలిసిన దివీస్ ల్యాబొరేటరీస్ సీఈవో డాక్టర్ కిరణ్ రూ.5 కోట్ల చెక్కును అందించారు. దీనిపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. వరద బాధితులను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు నాయకత్వంలోని రాష్ట్ర ప్రజలు ఐక్యంగా ముందుకు వస్తున్నారని కొనియాడారు. ఎంతో పెద్ద మనసుతో రాష్ట్రంలోని వరద బాధితుల సహాయార్థం రూ.9.8 కోట్ల విరాళం ప్రకటించిన దివీస్ ల్యాబొరేటరీస్ అధినేత డాక్టర్ మురళీ దివికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని వెల్లడించారు. దివీస్ సంస్థ సమయోచిత సాయం, అక్షయ పాత్ర సహకారంతో వరద బాధితులకు ఎంతో ఉపశమనం కలుగుతుందని, ఈ కష్టకాలంలో వరద బాధితులకు ఈ విరాళాలు తగిన ఆసరా అందిస్తాయని లోకేశ్ వివరించారు.

# ప్రకాశం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న బోట్ల వెలికితీత ప్రక్రియ

### మూడో రోజుకు చేరుకున్న వెలికితీత ప్రక్రియ

### బోట్లకు ఇనుప రోప్‌లు కట్టి బయటకు లాగే ప్రయత్నం

### మూడు రోజులుగా ప్రయత్నిస్తున్నా 20 మీటర్లు మాత్రమే కదిలిన పడవలు



ప్రకాశం బ్యారేజీ వద్ద బోట్ల తొలగింపు ప్రక్రియ ఆరో రోజుకు చేరుకుంది. ఇటీవల ముంచెత్తిన వరదల సమయంలో ఎగవ నుంచి కొట్టుకొచ్చిన పడవలు బ్యారేజీ గేట్లను ఢీకొట్టి ఆగిపోయాయి. ఒక్కోబోటు 40-50 టన్నులు ఉండడం, వాటిని ఒకదానికొకటి కలిపి కట్టేయడం వంటి కారణాలతో... దీని వెనక కుట్ర కోణం ఉందని ప్రభుత్వం చెబుతూ వస్తోంది. మొత్తం ఐదు పడవలు బ్యారేజీ గేట్లను ఢీకొట్టాయి. గేట్లను ఢీకొట్టడం ద్వారా ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలన్న కుట్ర పన్నారని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపించారు.

గేట్లను ఢీకొని ఆగిపోయిన బోట్లను తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తొలి ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో వాటిని ముక్కలు చేసి తొలగించే ప్రయత్నం చేయగా అది కూడా ఫలించలేదు. దీంతో కాకినాడ అబ్బులు బృందం బోట్లకు ఇనుప రోప్‌లు కట్టి పొక్లెయిన్లతో పైకి లాగుతోంది. మూడు రోజులుగా ప్రయత్నిస్తున్నా బోటు 20 మీటర్లు మాత్రమే కదిలింది. బోట్లు ఇసుకలో కూరుకుపోవడంతో తొలగింపు ప్రక్రియ క్లిష్టంగా మారింది.

# భూ సమీకరణలో రైతుల నుంచి అంగీకార పత్రాలు తీసుకున్న మంత్రి నారాయణ

**పెన్ పవర్ డెస్క్:** రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ రాజధాని అమరావతి ప్రాంతంలో పర్యటించారు. భూ సమీకరణలో భాగంగా ఎర్రబాలెంలో రైతుల నుంచి అంగీకార పత్రాలు తీసుకున్నారు. ఎర్రబాలెం గ్రామంలో పది మంది రైతుల నుంచి 10.37 ఎకరాల భూమిని సేకరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, ల్యాండ్ పూలింగ్ కింద భూములు ఇచ్చే వారికి, వారు కోరుకున్న చోట స్థలాలు కేటాయిస్తామని వెల్లడించారు. రైతులు తమను సంప్రదిస్తే ఇళ్లకే వెళ్లి భూములను తీసుకుంటామని చెప్పారు. అమరావతిలో ఎల్లుండి నుంచి జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నట్టు

తెలిపారు. ఇక, బుడమేరుకు మళ్లీ వరదలు వస్తున్నాయంటూ జరుగుతున్న ప్రచారంపై మంత్రి నారాయణ స్పందించారు. మళ్లీ వరదలు వస్తున్నాయన్న ప్రచారం వైసీపీ కుట్ర అని ఆరోపించారు.

వరదలపై సోషల్ మీడియాలో కనిపిస్తున్న అసత్య పోస్టులపై డీజీపీకి ఫిర్యాదు చేశామని చెప్పారు. ఇలాంటి దుష్ప్రచారం చేస్తే... చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఒకేసారి ఆరు వందేభారత్ రైళ్లను ప్రారంభించిన ప్రధాని మోదీ

- మొదటి పేజీ తరువాయి

వర్చువల్ విధానంలో ప్రారంభించారు. మిగతా ఐదు రైళ్లు... భాగల్ పూర్-దుమ్కా-హౌరా... బ్రహ్మపూర్-టాటానగర్... గయ-హౌరా... దేవగఢ్-వారణాసి... రూర్కేలా-హౌరా మార్గాల్లో నడుస్తాయి. తన పర్యటన సందర్భంగా మోదీ టాటా నగర్ రైల్వే స్టేషన్ వద్ద పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. దాదాపు రూ.660 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. మోదీ టాటా నగర్ లో భారీ రోడ్ షోలో పాల్గొనాల్సి ఉన్నప్పటికీ, భారీ వర్షం కారణంగా ఆ రోడ్ షో రద్దయింది.

# రెండు రోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తా..

- మొదటి పేజీ తరువాయి


అని ప్రజలకు పిలుపునిచ్చారు.

తనను జైలుకు పంపి, ఆప్ లో చీలికలు తీసుకురావాలని ప్రయత్నించారని, తద్వారా ఢిల్లీ పీఠం చేజిక్కించుకోవాలని భావించారని వివరించారు. ఎన్ని కుట్రలు పన్నినా ఆప్ ను విచ్ఛిన్నం చేయలేకపోయారని తెలిపారు. జైలు నుంచి కూడా ప్రభుత్వాన్ని నడపవచ్చని సుప్రీంకోర్టు ఉత్తర్వులు నిరూపించాయని అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించాలనే ఇన్నాళ్లూ రాజీనామా చేయలేదని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. మహారాష్ట్రతో పాటు ఢిల్లీకి కూడా ఎన్నికలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్ట్ అయి దాదాపు ఆరు నెలల పాటు జైలులో ఉన్న ఆయన తాజాగా బెయిలుపై బయటకు వచ్చారు. ఈ ఉదయం ఆయన తొలిసారి పార్టీ కొత్త హెడ్ క్వార్టర్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు. అయితే, ఈ వ్యాఖ్యల పట్ల పార్టీలో అంతర్గతంగా చర్చ బయలుదేరడంతో ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ వివరణ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా కేజ్రీవాలే ఉండాలని పార్టీలో ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. అయితే, కేజ్రీవాల్ వ్యాఖ్యల వెనుక ఉద్దేశం ఏమిటంటే... నవంబరులో ఎన్నికలకు వెళ్లి సత్తా నిరూపించుకోవాలని ఆయన భావిస్తున్నారని భరద్వాజ్ వివరించారు. ప్రజలు కేజ్రీవాల్ నిజాయతీపరుడు అని గుర్తిస్తే ఆప్ ఎన్నికల్లో గెలుస్తుందని, కేజ్రీవాల్ మరోసారి సీఎం అవుతారని స్పష్టం చేశారు.అంతకుముందు కేజ్రీవాల్ కార్యకర్తల సమావేశంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "నేను ప్రజల్లోకి వెళ్లి ఓటు

వేయమని అడుగుతాను. నేను నిజాయతీపరుడిని అనుకుంటే ప్రజల నాకు ఓటేస్తారు. అప్పుడు నేను సీఎం సీటులో కూర్చుంటా. లేదంటే లేదు" అని కార్యకర్తలతో జరిగిన సమావేశంలో కేజ్రీవాల్ స్పష్టం చేశారు.

మరో రెండ్రోజుల్లో సీఎం పదవికి తాను రాజీనామా చేస్తానని, తర్వాత పార్టీ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహిస్తుందని, ఆ తర్వాత సీఎం పేరును నిర్ణయిస్తుందని కేజ్రీవాల్ వివరించారు.

# భూమిపై చంద్రుడు రెండు నెలలు తిరుగుతాడు: శాస్త్రవేత్తలు



చందమామ రావే.. జాబిల్లి రావే.. అని పాట పాడుతూ పిల్లలకు అన్నం పెడుతుంటారు.. ఇది పాట కాదని నిజం అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూమిపైకి ఒక చిన్న చంద్రుడు వచ్చి రెండు నెలల పాటు ఉంటాడట. ఆకాశం నుంచి ఒక గ్రహశకలం భూమిపైకి వస్తుందని.. అది గురుత్వాకర్షణ పరిధిలో సంచరిస్తుందని ..ఆగష్టు 7న 2024 పీటీ5 అనే ఈ గ్రహశకలాన్ని సైంటిస్టులు కనుగొన్నారు . ఇది ఈ సంవత్సరం సెప్టెంబర్ 29 నుంచి నవంబర్ 25 వరకు భూమి చుట్టూ తిరుగుతుందని తెలిపారు.


అమెరికన్ ఆస్ట్రోనామికల్ సొసైటీ రీసెర్చ్ నోట్స్‌లో ప్రచురించిన నివేదిక ప్రకారం.. రాబోయే గ్రహశకలం కేవలం 10 మీటర్ల (33 అడుగులు) వ్యాసం ఉంటుంది. భూమి చుట్టూ 53 రోజుల పాటు పరిభ్రమించనుంది. అదే వ్యవధిలో 2024 పీటీ5 పూర్తి కక్ష్యను చిట్టి చంద్రుడు పూర్తిచేయదు. దానికి బదులుగా అది భూమి గురుత్వాకర్షణ పరిధి నుంచి విడిపోనుంది.

కార్లోస్ డి లా ఫ్యూంటె మార్కోస్, రౌల్ డి లా ఫ్యూంటె మార్కోస్ రచించిన నివేదికలో భూమికి గ్రహశకలాలను పట్టుకుని ... తన కక్ష్యలోకి లాక్కుంటుందని చెప్పారు. ఈ గ్రహశకలాలు కొన్నిసార్లు మన గ్రహం చుట్టూ ఒకటి లేదా అంతకంటే ఎక్కువ స్థాయిలో తిరిగి .. కక్ష్యను పూర్తి చేసే ముందు భూమి దీర్ఘవృత్తాకార మార్గం నుంచి విడిపోతాయి. అమెరికన్ ఆస్ట్రోనామికల్ సొసైటీ యొక్క రీసెర్చ్ నోట్స్‌లో ప్రచురించబడిన ఒక నివేదిక ప్రకారం .. భూమి పైకి వచ్చిన గ్రహశకలం కేవలం 10 మీటర్ల (33 అడుగులు) వ్యాసంఉంటుందన్నారు. ఇది 53 రోజులపాటు భూమి చుట్టూ తిరిగుతుందనని పేర్కొన్నారు. కాని 2024 %ూ%5 పూర్తి కక్ష్యను చేయదు. దీనికి బదులుగా భూమిపైకి వచ్చిన చిట్టి చంద్రుడు భూమి గురుత్వాకర్షణ నుండి విడిపోనుంది ఈ చిట్టి చంద్రుడిని మాత్రం నేరుగా మన కళ్లతో కానీ టెలిస్కోప్‌తో కానీ చూడలేమట. దీనిని చూడాలంటే శాస్త్రవేత్తలకే సాధ్యం అని అంటున్నారు.

2006లో, భూమి గురుత్వాకర్షణ ద్వారా సంగ్రహించిన ఒక ఉల్క.. దాని చుట్టూ జూలై 2006 నుంచి జూలై 2007 వరకు ఒక ఏడాది పాటు పరిభ్రమించింది. అయితే, కొత్తగా కనుగొన్న 2024 పీటీ5 2022 ఎన్ఎక్స్1 మార్గాన్ని పోలి ఉంటుంది. 1981, 2022లో భూమి చుట్టూ తిరిగే తాత్కాలిక ఫ్లైబై అనే గ్రహశకలం కనిపించింది. ఒక కక్ష్యను పూర్తి చేసి 2051లో మరో సెమీ రౌండ్‌కు తిరిగి రావచ్చు. 2006లో, భూమి యొక్క గురుత్వాకర్షణ ద్వారా సంగ్రహించబడిన ఒక ఉల్క ... దాని చుట్టూ జూలై 2006 నుండి జూలై 2007 వరకు

ఒక సంవత్సరం పాటు పరిభ్రమించింది. కొత్తగా కనుగొన్న 2024 %ూ%5 2022 ఎన్ ఎక్స్ 1 మార్గాన్ని పోలి ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 1981, 2022 లో భూమి చుట్టూ తిరిగే తాత్కాలిక ఫ్లైబై అనే శకలం కనిపించిదని .. అది ఇప్పటికే ఒక కక్ష్యను పూర్తి చేసి, 2051లో మరో సెమీ రౌండ్‌కు తిరిగి రావచ్చని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

## ప్రతిపక్ష నేత నాకు ప్రధాని పదవి ఆఫర్ చేశారు..నితిన్ గడ్కరీ ఆసక్తికర వ్యాఖ్యలు



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. లోక్ సభ ఎన్నికల సమయంలో తనకు ఓ ప్రతిపక్ష నేత ప్రధాని పదవి ఆఫర్ చేశారని చెప్పారు. ఏ పదవి కోసం తాను సిద్ధాంతాలకు రాజీపడబోనని చెప్పారు గడ్కరీ. నాగపూర్ లో జరిగిన జర్నలిస్టు అవార్డు కార్యక్రమంలో కీలక వ్యాఖ్యలు చేశారు గడ్కరీ. ప్రతిపక్ష నేత ఎవరనే విషయం తాను వెల్లడించలేనన్నారు. జీవితంలో ప్రధాని కావాలనే లక్ష్యం తనకు లేదన్నారు గడ్కరీ. తనకు ఎందుకు మద్దతివ్వాలని ఆ ప్రతిపక్ష నేతకు అడిగినట్లు చెప్పారు.

## చనిపోయిన అధికారికి డ్యూటీ వేసిన ఒడిశా సర్కారు

- ప్రధాని పర్యటన సందర్భంగా జనాలను నియంత్రించే విధులు కేటాయింపు
- ట్విట్టర్ లో వైరల్ గా మారిన అధికారిక లేఖ
- విషయం తెలియడంతో హడావుడిగా దిద్దుబాటు



ఒడిశాలో ఆయనో ఉన్నతాధికారి... అనారోగ్యంతో గతేడాది కన్నుమూశారు. తాజాగా ఆయనకు ప్రభుత్వం ఓ పని అప్పగించింది. ప్రధాని పర్యటన సందర్భంగా జనాలను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన అధికారుల బృందంలో ఆయన పేరును చేర్చింది. ఈమేరకు ఒడిశా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల కాపీ ప్రస్తుతం ట్విట్టర్ లో వైరల్ గా మారింది. దీనిపై ఒడిశా ప్రతిపక్ష నేతలు మండిపడుతున్నారు. పాపం చనిపోయినా కూడా సదరు అధికారిని ఈ డబుల్ ఇంజిన్ సర్కారు వదలడంలేదని బిజూ జనతాదళ్ సోషల్ మీడియా హెడ్ స్వయం ప్రకాశ్ మోహాపాత్ర వ్యంగ్యంగా ట్వీట్ చేశారు.

**అసలేం జరిగిందంటే...**

ఈ నెల 17న ప్రధాని నరేంద్ర మోదీ ఒడిశాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో క్రౌడ్ మేనేజింగ్ కోసం ఒడిశా సర్కారు ఉన్నతాధికారులతో ఓ బృందాన్ని ఏర్పాటు చేసింది. 50 మంది అధికారులకు ఒడిశా కంప్యూటర్ అప్లికేషన్ సెంటర్ (ఓసీఏసీ) లో డ్యూటీ వేసింది. ఇందులో ప్రబోధ కుమార్ రౌత్ అనే ఓఏఎస్ అధికారి పేరు ఉండడం విమర్శలకు దారి తీసింది. సదరు ప్రబోధ కుమార్ రౌత్ గతేడాది అనారోగ్యంతో చనిపోవడమే దీనికి కారణం.

ఓ చనిపోయిన అధికారికి డ్యూటీ వేయడమేంటని ప్రతిపక్ష బిజూ జనతాదళ్ నేతలు తీవ్రంగా మండిపడుతున్నారు. ఈ డబుల్ ఇంజిన్ గవర్నమెంట్ లో అధికారులు చనిపోయినా కూడా డ్యూటీ చేయాల్సిందే అంటూ వ్యంగ్యంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

సోషల్ మీడియాలో రచ్చ జరుగుతుండడంతో మేలుకున్న ఒడిశా సర్కారు వెంటనే తప్పుదిద్దుకుంది. ప్రబోధ కుమార్ స్థానంలో సుబ్రత్ కుమార్ జెనా అనే అధికారి పేరును చేర్చుతూ తాజాగా మరో ఆర్డర్ కాపీ విడుదల చేసింది.

## అయ్యో పాపం: CM మమతా బెనర్జీని మరోసారి అవమానించిన జూడాలు..!



వెస్ట్ బెంగాల్: టీఎంసీ చీఫ్, వెస్ట్ బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి మరోసారి చేదు అనుభవం ఎదురైంది. కోల్‌కతా హత్యాచార బాధితురాలికి న్యాయం చేయాలంటూ ఆందోళన చేస్తోన్న జూనియర్ డాక్టర్లు మమతా బెనర్జీకి మరోసారి ఊహించని షాక్ ఇచ్చారు. దీంతో జూనియర్ డాక్టర్ల తీరుపై దీదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

అసలేం జరిగిందంటే.. రాష్ట్ర రాజధాని కోల్‌కతాలోని ఆర్జీ కర్ హాస్పిటల్ అండ్ మెడికల్ కాలేజీలో జూనియర్ వైద్యురాలిపై అత్యంత పాశవికంగా హత్యాచారం జరిగిన విషయం తెలిసిందే.

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఘటనలో బాధితురాలికి రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గత కొన్ని రోజులుగా తోటి జూనియర్ డాక్టర్లు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు. దీంతో జూడాలను రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. అయితే, చర్చలను లైవ్ స్ట్రీమింగ్ చేయాలని జూడాలు కండిషన్ పెట్టడంతో ఇందుకు ప్రభుత్వం అంగీకరించలేదు. దీంతో చర్చలు ముందుకు సాగలేదు. తాజాగా మరోసారి సీఎం మమతా బెనర్జీ జూనియర్ డాక్టర్లను చర్చలకు ఆహ్వానించింది. దీంతో సీఎం నివాసానికి వెళ్లిన జూడాలు చివరి నిమిషంలో మమతా బెనర్జీకి ఊహించని షాక్ ఇచ్చారు. ప్రభుత్వం తమ కండిషన్లకు ఒప్పుకోకపోవడంతో నివాసం దగ్గరకు వచ్చిన జూడాలు సీఎం ఇంట్లోకి వెళ్లకుండా వెనుదిరిగారు. దీంతో

జూడాల తీరుపై సీఎం దీదీ అహసనం వ్యక్తం చేశారు. బాధితురాలికి న్యాయం చేయాలనే ఉద్దేశంతో జూడాలను చర్చలకు ఆహ్వానిస్తున్నా.. వారు పదే పదే తనను అవమానిస్తున్నారని మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, జూడాలకు మధ్య చర్చలు మరోసారి ముందుకు సాగకపోవడంతో జూనియర్ డాక్టర్లు ఆందోళనను తిరిగి కంటిన్యూ చేయనున్నట్లు తెలుస్తోంది.

## క్యాన్సర్ ను కట్టడి చేసే కొత్త వ్యాక్సిన్... ఎలా పనిచేస్తుందంటే?

### తొలిదశ ప్రయోగాల్లో ఆశ్చర్యకరమైన ఫలితాలు

### రోగనిరోధక శక్తిని ఉత్తేజితం చేస్తున్న వ్యాక్సిన్

### క్యాన్సర్ కణాలను గుర్తించి, ఫైట్ చేసేలా ప్రోత్సహిస్తున్నట్లు గుర్తించిన సైంటిస్టులు




క్యాన్సర్... ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ప్రాణాలను హరిస్తున్న ఈ మహమ్మారికి ఇప్పటి వరకూ నిర్దిష్టమైన ఔషధమంటూ లేదు. రేడియేషన్ వంటి చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నప్పటికీ అవేవీ పూర్తిస్థాయిలో ఫలితాలు ఇవ్వడంలేదని వైద్య నిపుణులు చెబుతున్నారు. పైపెచ్చు వీటితో అనేక దుష్ప్రభావాలు ఉంటాయని చెప్పారు. ఈ నేపథ్యంలోనే క్యాన్సర్ పై పోరాటానికి సరికొత్త వ్యాక్సిన్ ను ఇంగ్లాండ్ సైంటిస్టులు అభివృద్ధి చేశారు. ఈ వ్యాక్సిన్ ప్రభావాన్ని తెలుసుకునేందుకు చేస్తున్న తొలి దశ ప్రయోగాలలో ఆశ్చర్యకరమైన ఫలితాలు గుర్తించినట్లు చెప్పారు. ఈ వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చాక క్యాన్సర్ మరణాలు గణనీయంగా తగ్గుతాయని, చికిత్సలో మెరుగైన ఫలితాలు వస్తాయని వివరించారు. ఈ వ్యాక్సిన్ కు వారు ఎంఆర్ఎన్ఏ%-%4359 అని నామకరణం చేశారు. ఈ వ్యాక్సిన్ తో పెద్దగా దుష్ప్రభావాలు ఉండవని చెప్పారు.

**వ్యాక్సిన్ పనిచేసేది ఇలా...**


లండన్ లోని కింగ్స్ కాలేజ్ లో ఎక్స్ పెరిమెంటల్ ఆంకాలజీలో క్లినికల్ రీడర్ గా వ్యవహరిస్తున్న డాక్టర్ దేబాశిష్ సర్కార్ వెల్లడించిన వివరాల ప్రకారం... ఎంఆర్ఎన్ఏ%-%4359 వ్యాక్సిన్ మానవ శరీరంలోని సహజ రోగనిరోధక శక్తిని మరింత ఉత్తేజితం చేస్తుంది. క్యాన్సర్ కణాలను గుర్తించేందుకు తోడ్పడుతుంది. సాధారణ కణాలు, క్యాన్సర్ కణాలకు మధ్య తేడాను గుర్తించి, క్యాన్సర్ కణాలను ఎదగకుండా అడ్డుకునేలా చేస్తుంది. అంతేకాదు, కొత్త క్యాన్సర్ కణాలు పుట్టుకు రాకుండా అడ్డుకుంటుంది. క్యాన్సర్ కణాలు శరీరంలో వేగంగా విస్తరించి కణుతులుగా ఏర్పడతాయి. దీనిని అడ్డుకోవడానికి రోగ నిరోధక శక్తిని ఈ వ్యాక్సిన్ ప్రోత్సహిస్తుంది. తద్వారా క్యాన్సర్ ను నిర్మూలించడానికి ఈ వ్యాక్సిన్ ఓ కొత్త మార్గాన్ని చూపుతుంది. క్యాన్సర్ చికిత్సలో కొత్త మందుల ఆవిష్కరణకు ఈ వ్యాక్సిన్ ఓ ముందడుగు అని డాక్టర్ దేబాశిష్ సర్కార్ చెప్పారు.

## గణేష్ నిమజ్జనం రోజు మెట్రో సర్వీస్ టైం పొడిగింపు



గ్రేటర్ హైదరాబాద్ లో గణేష్ నిమజ్జనాలు, ప్రయాణికుల రద్దీ కారణంగా మెట్రో యాజమాన్యం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. నిమజ్జనం రోజు (సెప్టెంబర్ 17)న అర్ధరాత్రి తర్వాత కూడా మెట్రో సర్వీసులు నడపనుంది. అన్ని మెట్రో లైన్లలో సెప్టెంబర్ 17న రాత్రి 1 గంట వరకు మెట్రో రైళ్లు అందుపాటులో ఉంటాయి. లాస్ట్ మెట్రో ట్రైన్ సెప్టెంబర్ 18న 1AM కు ఉంటుందని HMRL MD NVS రెడ్డి తెలిపారు. ఖైరతాబాద్, లక్డీకాపూల్ మెట్రో స్టేషన్లలో అదనపు పోలీసులు, భద్రత ఉండనుంది. అయితే ఖైరతాబాద్ కు వచ్చే మెట్రో ప్రయాణికులు క్రమశిక్షణ పాటించాలని కోరారు.

## ప్రైస్ ట్యాగ్ గన్..చిన్న కిరాణా షాపులోళ్లకు ఎంతో ఉపయోగం



చిన్న చిన్న కిరాణా షాపులు, ప్రొడక్షన్ యూనిట్లలో సరుకులకు ప్రైస్ ట్యాగ్స్ వేయాల్సి ఉంటుంది. అలాంటివాళ్లకు ఈ గాడ్జెట్ బెస్ట్ చాయిస్. సంవర్ధన్ అనే కంపెనీ దీన్ని తయారుచేసింది. పైగా దీనికి పవర్, బ్యాటరీలు కూడా అవసరం లేదు. ప్రింట్ చేయాల్సిన నెంబర్లను ముందుగానే సెట్ చేసుకుని గన్‌కు ఉండే హ్యాండిల్‌ని నొక్కితే ప్రింట్ అయిపోతుంది. ఎనిమిది అంకెల వరకు ప్రింట్ చేసుకోవచ్చు. ఇంక్ అయిపోయినా ఈజీగా రీఫిల్ చేసుకోవచ్చు. వన్ టచ్ ఓపెనింగ్ ఇంక్ రోలర్ సిస్టమ్ ఉంటుంది. ఒక్కో లేబుల్ 22 మిల్లీమీటర్ల వెడల్పు, 12 మిల్లీమీటర్ల పొడవు ఉంటుంది. ఈ గన్‌తోపాటు ప్యాక్‌లో 5,150 లేబుల్స్, రెండు ఇంక్ రోలర్లు కూడా వస్తాయి. ధర : 589 రూపాయలు

## పెద్దపల్లి గుండ్లమ్మ చెరువు దగ్గర నిమజ్జన ఏర్పాట్లు ఎమ్మెల్యే విజయరమణారావు, రామగుండం సీపీ పరిశీలన



గణేష్ నిమజ్జనం సందర్భంగా పెద్దపల్లి ఎల్లమ్మ గుండమ్మ చెరువు దగ్గర నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించారు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్. పెద్దపల్లి నియోజవర్గంలో సోమవారం ( సెప్టెంబర్ 16) నిమజ్జనం సందర్భంగా వివిధ శాఖల అధికారులతో కలిసి నిమజ్జన ఏర్పాట్లను పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు పరిశీలించారు. గణేష్ నిమజ్జనం ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. గణేష్ శోభాయాత్రలో ఇబ్బందులు ఎదురైతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని... భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పెద్దపల్లి ఎల్లమ్మ గుండమ్మ చెరువు వద్ద రెండు క్రేన్లను, సుల్తానాబాద్ పెద్ద చెరువు వద్ద మరో క్రేన్ ను ఏర్పాటు చేశామన్నారు.

## చేతబడి చేస్తున్నారనే అనుమానంతో 5మందిని దారుణంగా హతమార్చిన గ్రామస్థులు



ఈ మధ్యకాలంలో కొందరు నిజానిజాలు తెలుసుకోకుండా తీసుకునే నిర్ణయాలు కారణంగా ఇతరులు బలౌతున్నారు. తాజాగా చేతబడి చేస్తున్నారనే కారణంగా ఒకే కుటుంబానికి చెందిన 5మందిని గ్రామస్తులు దారుణంగా కొట్టి చంపిన ఘటన ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలో చోటు చేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళితే స్థానికి రాష్ట్రంలోని సుక్మా జిల్లాకి చెందిన కోయిలిబేడ గ్రామంలో మౌసం కన్నా అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. అయితే గత కొద్ది రోజులుగా కోయిలిబేడ గ్రామంలోని ప్రజలు అనారోగ్యంతో బాధపడటం, అనుమానాస్పద సంఘటనలు జరగటం వంటివి చోటు చేసుకుంటున్నాయి. దీంతో వీటన్నింటికి మౌసం కన్నా కుటుంబ సభ్యులు చేతబడి చెయ్యడమే కారణమని గ్రామస్థులు ఏకంగా మోసం కన్నా మరియు అతడి భార్య, కొడుకు, కోడలు మరియు మరో కుటుంబ సభ్యురాలిపై దారుణంగా రాళ్లతో మరియు కర్రలతో దాడి చేశారు.అయితే స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నప్పటికీ అప్పటికే భాదితులు మరణించారు. దీంతో కొందరు స్థానికులను అదుపులోకి తీసుకుని పోలీసులు వివిధ కోణాల్లో విచారిస్తున్నారు.

## దేశంలో నిఫా వైరస్ కలకలం.. కేరళలో మరో వ్యక్తి మృతి




దేశంలో నిఫా వైరస్ కలకలకం సృష్టిస్తోంది. కేరళలో మరో వ్యక్తి నిఫాతో చనిపోయాడు. మలప్పురం జిల్లాలో 23ఏండ్ల యువకుడు నిఫావైరస్ లక్షణాలతో బాధపడుతూ చనిపోయాడు. గతనెల ఇదే జిల్లాలో ఓ విద్యార్థి చనిపోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. నిఫా లక్షణాలు ఉంటే తక్షణమే టెస్టులు చేయించుకోవాలని ఆదేశించారు. చనిపోయిన వ్యక్తి రక్తనమూనాలను సేకరించిన వైద్యులు.. పుణె ల్యాబ్ కు టెస్టుకోసం పంపారు. చనిపోయిన వ్యక్తి కుటుంబాన్ని క్వారంటైన్ కి తరలించారు. కోవిడ్ తరహా నిబంధనలు వర్తిస్తాయని జిల్లా అధికారులు హెచ్చరించారు. సామాజిక దూరం పాటించాలని సూచించారు.

# విరాట్ కోహ్లీ సహా ఎంతోమంది నా సారధ్యంలో ఆడారు.. తేజస్వీ యాదవ్ వ్యాఖ్యలు వైరల్

**2009లో ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అడుగుపెట్టిన తేజస్వీయాదవ్**

**2010లో తొలి లిస్ట్ ఏ మ్యాచ్ ఆడిన ఆర్జేడీ నేత**

**2008 నుంచి 2012 వరకు ఐపీఎల్‌లో ఢిల్లీ జట్టుకు ప్రాతినిధ్యం**





ఆర్జేడీ నేత, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలు ప్రసాద్ యాదవ్ కుమారుడు తేజస్వీ యాదవ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఆయన తన క్రికెట్ అనుభవాలను పంచుకుంటూ.. క్రికెట్ సూపర్ స్టార్ విరాట్ కోహ్లీ దేశవాళీ క్రికెట్‌లో తన సారథ్యంలోనే ఆడాడని గుర్తుచేసుకున్నారు. ప్రస్తుత భారత జట్టులో కొనసాగుతున్న ఎంతోమంది ఆటగాళ్లు తన బెంచ్‌మేట్సేనని చెప్పుకొచ్చారు. తేజస్వీయాదవ్ తన కెరియర్‌లో ఒకే ఒక ఫస్ట్‌క్లాస్ మ్యాచ్, రెండు లిస్ట్ ఏ మ్యాచ్‌లు, నాలుగు టీ20లు ఆడారు. దేశవాళీ క్రికెట్‌లో ఝూర ఖండ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. నవంబర్ 2009లో ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అడుగుపెట్టిన తేజస్వీ విదర్భతో తొలి మ్యాచ్ ఆడారు. ఫిబ్రవరి 2010లో తొలి లిస్ట్ ఏ మ్యాచ్‌ను త్రిపుర, ఒరిస్సాతో ఆడారు. ఒరిస్సా, అస్సాం, బెంగాల్, త్రిపురతో నాలుగు టీ20లు ఆడారు.

'జీ మీడియా'కు ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో తేజస్వి మాట్లాడుతూ.. క్రికెటర్‌గా తనను ఎవరూ గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. "నేనో క్రికెటర్‌ను. దాని గురించి ఎవరూ మాట్లాడడం లేదు. విరాట్ కోహ్లీ నా కెప్టెన్సీలో ఆడాడు. ఎవరైనా దాని గురించి మాట్లాడారా? ఎందుకలా? నేను మంచి క్రికెట్ ఆడాను. ప్రస్తుత టీమిండియా ఆటగాళ్లలో ఎంతోమంది నా బెంచ్‌మేట్లే" అని తేజస్వి గుర్తు చేసుకున్నారు. తన రెండు కాళ్లకు గాయాలు కావడంతోనే క్రికెట్ నుంచి తప్పుకోవాల్సి వచ్చిందని వివరించారు.

తేజస్వీ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తేజస్వీ యాదవ్ 2008 నుంచి 2012 వరకు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఢిల్లీ డేర్ డెవిల్స్ (ప్రస్తుతం ఢిల్లీ కేపిటల్స్)కు ప్రాతినిధ్యం వహించారు. అయినప్పటికీ ఒక్క మ్యాచ్‌లోనూ ఆడే అవకాశం రాలేదు.

# ఎంఎస్ ధోనీపై కీలక నిర్ణయానికి వచ్చిన సీఎస్కే.. ఇక అంతా బీసీసీఐ చేతుల్లోనే!

- రిటైర్డ్ ఆటగాళ్లను అన్‌క్యాప్డ్ కేటగిరిలో చేర్చాలని బీసీసీఐని సీఎస్కే కోరినట్టుగా వార్తలు
- పాత నిబంధనను తిరిగి తీసుకోవాలని విజ్ఞప్తి
- అదే జరిగితే తక్కువ ధరకే ధోనీని సీఎస్కే కొనసాగించుకునే అవకాశం



తదుపరి ఐపీఎల్ సీజన్‌కు ముందు ఆటగాళ్ల మెగా వేలం జరగనుండడంతో బీసీసీఐ ఇందుకు సంబంధించిన కసరత్తులు చేస్తోంది. ముఖ్యంగా ఆటగాళ్ల రిటెన్షన్ సంఖ్యపై వివిధ ఫ్రాంచైజీలు చేసిన సూచనలను ఐపీఎల్ పాలక మండలి పరిశీలిస్తోంది. కొన్ని ఫ్రాంచైజీలు గరిష్ఠంగా 8 మంది ఆటగాళ్లను రిటెయిన్ చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని కోరాయి. అయితే కొన్ని ఫ్రాంచైజీలు మాత్రం ఒక్క ఆటగాడిని కూడా నిలుపుదల చేసుకోవడానికి ఆసక్తి చూపలేదని తెలుస్తోంది. మొత్తంగా చూస్తే 5 నుంచి 6 మంది ఆటగాళ్లను రిటెయిన్ చేసుకునేందుకు బీసీసీఐ అవకాశం ఇవ్వవచ్చనే ఊహాగానాలు వెలువడుతున్నాయి. దీనిపై బీసీసీఐ ఇంతవరకు అధికారిక ప్రకటన ఏమీ చేయలేదు. నిజానికి ఆగస్టు చివరి నాటికి రిటెయిన్ ఆటగాళ్ల సంఖ్యపై ప్రకటన చేయాల్సి ఉన్నప్పటికీ సెప్టెంబర్ చివరి వరకు వేచిచూడాలని భావిస్తున్నట్టు సమాచారం. రిటైర్ అయిన ఆటగాళ్లను 'అన్‌క్యాప్డ్'గా వర్గీకరించాలంటూ వచ్చిన విజ్ఞప్తిని పరిశీలిస్తుండడమే ఈ జాప్యానికి కారణంగా ఉన్నట్టు తెలుస్తోంది. రిటైర్డ్ ప్లేయర్లను అన్‌క్యాప్డ్ ఆటగాళ్లుగా వర్గీకరించే పాత నిబంధనను తిరిగి ప్రవేశపెట్టాలని బీసీసీఐని చెన్నై సూపర్ కింగ్స్ కోరింది. ఈ రూల్‌ను తిరిగి అమలు చేస్తే ఎంఎస్ ధోనీని తక్కువ ధరలో కొనసాగించవచ్చునని ఆ ఫ్రాంచైజీ యోచిస్తోంది. అయితే ఈ నిబంధన ఒక్క చెన్నై సూపర్ కింగ్స్‌కు మాత్రమే కాకుండా ఇతర జట్లకు కూడా ప్రయోజనం చేకూర్చుతుందనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. అందుకే సీఎస్కే అభ్యర్థనను బీసీసీఐ నిశితంగా పరిశీలిస్తున్నట్టు క్రిక్‌బజ్ కథనం పేర్కొంది. ఎంఎస్ ధోనీ అన్‌క్యాప్డ్ కేటగిరిలో ఉంటే అతడిని తక్కువ ధరకే కొనసాగించవచ్చునని చెన్నై సూపర్ కింగ్స్ భావిస్తోంది. ప్రతి జట్టుకు రిటైర్ అయిన ఆటగాళ్లను రిటెయిన్ చేసుకునే అవకాశం ఇస్తే వారికి ఎంత చెల్లించాలనేది ఫ్రాంచైజీ చేతిలో ఆధారపడి ఉంటుంది. తద్వారా వేలంలో జట్టు వద్ద ఉన్న పరిమిత డబ్బును సద్వినియోగం చేసుకోవచ్చని సీఎస్కే ఫ్రాంచైజీ భావిస్తున్నట్టు సమాచారం. అయితే ఈ నిబంధనను తిరిగి అమలు చేయడానికి బీసీసీఐ అనుమతిస్తుందో లేదో వేచిచూడాలి. మొత్తంగా చూస్తే సీఎస్కేలో ధోనీ రిటెయిన్ బీసీసీఐ నిర్ణయంపై ఆధారపడినట్టు స్పష్టమవుతోంది.

# బంగ్లాదేశ్‌తో టెస్ట్ సిరీస్‌కు టీమిండియా ఎత్తుగడ ఇదే!

**టెస్ట్ సిరీస్‌లో పాకిస్థాన్‌ను ఓడించి మంచి జోష్ మీద ఉన్న బంగ్లా టీమ్**

**సెప్టెంబర్ 19 నుంచి బంగ్లాదేశ్-భారత్ మధ్య చెన్నైలో తొలి టెస్ట్**

**బంగ్లా బ్యాటర్లకు అడ్డుకట్ట వేసేందుకు ఎర్రమట్టితో తయారు చేసిన పిచ్ వినియోగంపై కసరత్తు**

**బంగ్లా యువ పేసర్ నహిద్ రాణాను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు పంజాబ్ పేసర్ గర్నూర్ బ్రార్‌ను రంగంలోకి దింపిన భారత్**




ఇటీవల టెస్ట్ సిరీస్‌లో పాకిస్థాన్‌ను ఓడించి మంచి జోష్ మీద ఉన్న బంగ్లాదేశ్ టీమ్‌ను టీమిండియా అంత తేలికగా తీసుకోవడం లేదు. ఈ నెల (సెప్టెంబర్) 19 నుంచి స్వదేశంలో బంగ్లాదేశ్ తో టీమిండియా తొలి టెస్టు ఆడనుంది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం ఈ మ్యాచ్ కు ఆతిథ్యమివ్వనుంది. ఈ క్రమంలో బంగ్లాదేశ్ బ్యాటర్ల ఊపునకు అడ్డుకట్ట వేసేందుకు టీమిండియా పలు ఎత్తుగడలు వేస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా ఈ మ్యాచ్ కు ఎర్రమట్టితో తయారు చేసిన పిచ్ ను వినియోగించాలని టీమిండియా భావిస్తున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ఈ స్టేడియంలో నల్ల మట్టితో తయారు చేసిన పిచ్ ను ఉపయోగిస్తుంటారు. మందకొడిగా ఉండే నల్ల మట్టి పిచ్‌లు స్పిన్ బౌలింగ్‌కు అనుకూలిస్తాయి. అయితే, ఇటీవల కాలంలో బంగ్లా బ్యాటర్లు స్పిన్నర్లను సమర్ధవంతంగా ఎదుర్కొంటున్నారు. అంతే కాకుండా బంగ్లా టీమ్‌కు నాణ్యమైన స్పిన్ బౌలింగ్ దళం ఉంది. వీటిని దృష్టిలో పెట్టుకుని ఎర్రమట్టి పిచ్‌ను వినియోగించి బంగ్లాకు అడ్డుకట్ట వేయాలని భారత్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. పేస్ బౌలింగ్ తో బంగ్లా బ్యాటర్లను ముప్పు తిప్పలు పెట్టాలన్న వ్యూహంలో భాగంగా పలు చర్యలు చేపడుతోంది. జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్ వంటి బౌలర్లతో టీమిండియా పేస్ విభాగం పటిష్టంగా ఉంది. భారత్‌తో పోలిస్తే బంగ్లాదేశ్ పేస్ దళం బలహీనంగా ఉంది. అంతే కాకుండా పాకిస్థాన్‌పై బంగ్లా టెస్ట్ సిరీస్ గెలవడంలో కీలక పాత్ర పోషించిన యువ పేసర్ నహిద్ రాణాను (6 అడుగుల 5 అంగులాల ఎత్తు) సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు భారత్ .. పంజాబ్ పేసర్ గర్నూర్ బ్రార్‌ను (6.6 ఫీట్స్) రంగంలోకి దించింది.

## ఆశు రెడ్డి తన స్టైల్‌లో గ్రీన్ లెహంగాను చంపేసింది



# జిమ్ లో వర్ష హార్డ్ వర్క్.. స్టన్నింగ్ లుక్




సౌత్ లో మోస్ట్ టాలెంటెడ్ యాక్టర్స్ లలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్న నటి వర్ష బొల్లమ్మ. సతురన్ అనే తమిళ్ మూవీతో వర్ష బొల్లమ్మ హీరోయిన్ గా కెరియర్ స్టార్ట్ చేసింది. తరువాత కళ్యాణం అనే చిత్రంతో మలయాళీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. 2020లో చూసి చూడంగానే సినిమాతో వర్ష తెలుగులోకి హీరోయిన్ గా అడుగుపెట్టింది. మూడు భాషలలో కూడా వర్ష బొల్లమ్మకి యాక్టర్ గా మంచి ఇమేజ్ ఉంది. ఆమె చేసిన ప్రతి సినిమాలో కూడా మంచి పెర్ఫార్మెన్స్ కి స్కోప్ ఉన్న పాత్రలలోనే వర్ష కనిపించింది. ఆమె తన నటనతోనే ప్రేక్షకుల ప్రశంసలు సొంతం చేసుకొని అవకాశాలు దక్కించుకుంటుంది. వర్ష బొల్లమ్మ చివరిగా ఊరు పేరు భైరవకోన సినిమాలో శర్వానంద్ కి జోడీగా నటించింది. ఈ సినిమా కమర్షియల్ సక్సెస్ అందుకోలేదు. ప్రస్తుతం అయితే వర్ష చేతులో పెద్దగా సినిమాలు లేవు. %శూశ్రీంశీ =ఋఒ% - హీరోయిన్‌ని వదిలేసి పారిపోయిన ప్రియుడు అయిన కూడా ఈ బ్యూటీ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. ముఖ్యంగా ఇన్ స్టాగ్రామ్ లో రెగ్యులర్ గా వర్ష తన అప్డేట్స్ ని షేర్ చేసుకుంటూ ఉంటుంది. దీంతో ఇన్ స్టాగ్రామ్ లో వర్షకి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఆమె ఇన్ స్టాగ్రామ్ లో గ్లామర్ పిక్స్ కంటే డిఫరెంట్ స్టైల్ లో తనని తాను రిప్రజెంట్ చేసుకుంటూ ఫోటోలని పంచుకుంటూ ఉంటుంది. తాజాగా ఇన్ స్టాగ్రామ్ లో ఈ అమ్మడు జిమ్ లో వర్క్ అవుట్స్ చేసిన తర్వాత అద్దం ముందు నిలబడి సెల్ఫీ తీసుకుంది. ఈ పిక్స్ ని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. ఈ ఫోటోలో వర్ష చాలా స్లిమ్ గా కనిపిస్తోంది. పేస్ లో డిఫరెంట్ ఎక్స్ ప్రెషన్ పెట్టి సెల్ఫీకి ఫోజులిచ్చింది. ఈ పిక్ పై ఇన్ స్టాగ్రామ్ లో చాలా ఫన్నీ కామెంట్స్ వస్తున్నాయి. ఇలాంటి ఫన్నీ ఫోటోలని వర్ష రెగ్యులర్ గా ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేస్తూ ఫ్యాన్స్ కి వినోదాన్ని అందిస్తూ ఉంటుంది.



**జ్ఞానేశ్వరి కాండ్రేగుల గోల్లు సింపుల్‌గా కనిపిస్తున్నాయి**

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com